# ప్రేమ వేసిన మరో వెర్రితల

ఇచ్ఛాపురపు రామచంద్రం



సాయంత్రం చల్లని గాలి. చక్కని ఎండ. వాతావరణం చాలా బాగుంది. అయినా గంగాధరానికి మాత్రం చాలా చికాకుగా ఉంది. ఉదయం జరిగిన సంఘటనని అతనెంత ప్రయత్నించినా మరచిపోలేక పోతున్నాడు. ఒకసారి గార్డెన్‌లో తిరిగొస్తే మనసుకి ప్రశాంతత లభిస్తుందేమో అన్న ఆశతో అతనంతవరకూ కూర్చున్న వాలుకుర్చీలోంచి లేవబోయాడు. అంతలో యజమాని మనసూ, తన డ్యూటీ గ్రహించినట్లు తోకూపుకుంటూ వొచ్చింది జూలీ. దాన్ని చూడగానే అతని చికాకు ఒక్కసారే వెయ్యి రెట్లయిపోయింది. "గెటవే." అరిచాడు. "నేనేం చేశానూ?" అంటున్నట్లు ఆ కుక్క బిక్కమొహం వేసి - తోకూపడం ఆపేసి అతనివంకే చూస్తూ ఉండిపోయింది జూలీ.

"నంగనాచి, స్టుపిడ్... బ్యాడ్ మానర్డ్. ఏమయినా నువ్వు కుక్కవే కుక్కతోకే కాదు దాని బుద్ధీ వంకరే. దాన్ని సరిచెయ్యడం సాక్షాత్తూ బ్రహ్మతరం కూడా కాదు. లోపలికి పో -" అరుస్తూ చెయ్యికూడా ఎత్తాడు. వూలమ్మిన చోట కట్టెలమ్మ వలసివచ్చినంత అవమానపడిపోతూ యజమానితో గార్డెన్‌లోకి వెళ్లవలసిన జూలీ - యింట్లోకి వెళ్లిపోయింది తోకముడిచి. నోరులేని ఆ ప్రాణిమీద గంగాధరానికి వొచ్చిన కోపం న్యాయమైనదే.

గంగాధరం మనవరాలు లలిత. ఆమె కొత్త కాలేజ్‌మేట్ రోజా. సార్థకనామధేయ. గులాబి పువ్వంత సుకుమారంగానూ సుందరంగానూ ఉంటుంది. ఇవాళ ఉదయం జూలీని చూసి ముచ్చటపడి దగ్గరగా తీసుకుంది. అంతే... ముద్దొచ్చాడని చంకనెత్తుకో బోతే మూతి కొరికిన పెంకి పిల్లాడిలా... రోజా కాలేజిలో చదువుకుంటున్న అమ్మాయని కాని. చాలా అందమైనదని కాని...ఐశ్వర్యవంతుల పిల్లనికాని.... ఏమీ చూడకుండా..మంచీ చెడ్డలేకాకుండా...లలిత ఫ్రండని కూడా ఆలోచించ కుండా చటుక్కున కరిచేసింది డర్టీ జూలీ... తమ పరువు పీకి పందిరేస్తూ. ఆ అమ్మాయెంత కంగారు పడిందో ! తను జూలీని ఒక్కటేసి..."రక్తం రాలేదు. ఫరవాలేదు. ఐనా మా డాక్టర్‌కి ఫోన్ చేస్తాను. ఇంజక్షనిస్తాడు వొచ్చి. జరిగినదానికి వెరీసారీ." అంటూ ఎన్నో క్షమాపణలు చెప్పాడు లలిత వొంతూ తన వొంతూ. ఆమె వీటిలో కొన్నిటిని మాత్రమే విని - "నేను మా ఫ్యామిలి డాక్టరుకి చూపించు కుంటాలెండి" - అనేసి వెళ్లిపోయింది వెంటనే. అలాగే తన పరువు తీసేసిన జూలీమీద ఎంతేనా కోపం వొచ్చింది గంగాధరానికి. ఆకోపం యిప్పటికీ తగ్గలేదు. అందుకే - జూలీని రోజూలా తనతో షికారు రానివ్వలేదు.

వీధి గేటు చప్పుడయింది ఎవరో కుర్రాడు. "నమస్కారం తాతగారు !"

"దీర్ఘాయుష్మాన్‌భవ. ఎవరు కావాలి?"

"మీరే మీ కోసమే వచ్చాను. చిన్న పని మీద. మాట్లాడాలని."

"ఈ ముసిలాడితో నీలాటి యువకుడికేం పనీ ? కూర్చో." ఆశ్చర్యపోతూ కుర్చీ చూపాడు.

"థాంక్స్. తాతగారూ ! మీరు ప్రేమించారా ?"

గంగాధరం ముఖం ఎర్రబడిపోయింది కోపంతో. "నీకేమన్నా వేళాకోళంగా ఉందా? అవ్వని పట్టుకుని వసంతమాడడమంటే యిదే. అదేమిట్రా అవ్వతో సరసమాడుతున్నావంటే, అయ్యో.... అమ్మనుకున్నానన్నవాడికి అన్నలా ఉన్నావు - బుద్ధీ, జ్ఞానమూ, సభ్యతలలో ఒక్కటీ లేకుండా. గేటౌట్" "క్షమించండి, మీకు కోపం తెప్పించినందుకు. అసభ్యంగానూ, అసహ్యంగానూ మాట్లాడ్డం నా ఉద్దేశం ఎంతమాత్రమూ కాదు. అమాయకుణ్ని... ఆపైన ప్రేమలో పడినవాణ్ని."

అంటూ పాదాలమీద పడిపోయాడు. గంగాధరం ఆ అభ్యర్ధనకి కరిగిపోయి – "సరే.లే." అన్నాడు. కాని ఆ యువకుడాయన పాదాలను వదలకుండానే... " నేను ఆడబోయే మాటలలో తప్పులున్నా క్షమించాలి. ఒకటి మాత్రం నిజం. నేను వచ్చింది మిమ్మల్ని బాధించడానికెంత మాత్రం కాదు." అన్నాడు.

"అలాగే లే."

"ప్రేమంటే మీ అభిప్రాయం...."

"ప్రేమ పిచ్చిది..... వెర్రిది...గుడ్డిది. బుద్ధి లేనిది. చెవిటిది.. బుర్రలేనిది... కొరివి... ఎక్స్ట్రా." అన్నాడు గంగాధరం కచ్చితమైన కంఠంతో.

ఆ యువకుడి ముఖం పాలిపోయింది. కళ్ళనిండా నీళ్ళు వచ్చేశాయి.

ఆముఖం చూసి జాలేసి – "అసలు నీకేం కావాలి?" అని అడిగాడు గంగాధరం.

"మీకొక మనవరాలుంది – లలిత. ఆమెకో ఫ్రెండుంది – రోజా. మీకో కుక్కుంది.జూలీ. ఈ ఉదయం జూలీ, రోజాని కరిచింది–"

"నష్టపరిహారం అడగాలని వచ్చావా ! ఐనా నీకూ రోజాకీ ఏమిటి సంబంధం ?" అన్నాడు గంగాధరం. రోజాని జూలీ కరిచిన వార్త అప్పుడే ప్రచారమైపోయిందా ! అందమైన అమ్మాయిని కుక్క కరిచినా విశేషమే నేమో.

నేను కోరుతున్నది నష్టపరిహారం కాదు. రోజాని కరిచిన కుక్క నన్ను కూడా కరిచేందుకు సాయం చేయమని మిమ్మల్నర్థించడానికి మాత్రమే వచ్చాను."

నివ్వెరపోయాడు గంగాధరం. "ఏమిటి! రోజాని కరిచిన మాకుక్క నిన్ను కూడా కరవాలా ! ఎందుకూ !" అతనికి పిచ్చనుకున్నాడు.

"ప్రేమ. ఐలవ్ రోజా. కాని... ఆమె నన్ను ప్రేమిస్తున్నట్లనిపించదు. ఆమెని కరిచిన కుక్కే నన్ను కూడా కరిస్తే... ఆమెకు నామీద ప్రేమ ఉదయిస్తుందని నా ఆశ. ఇద్దరినీ ఒకే కుక్క కరిచిందనేది కామన్ పాయింటయి....."

గంగాధరానికి నోట మాట రాలేదు. కొన్ని క్షణాలు తెల్లబోయి ఉండిపోయి " ఒకే కుక్కచేత కరవబడడం ప్రేమికులుగా మార్చవొచ్చును! బలే థీరీ. ప్రేమలో పడినందునే నీకింత అమోఘమైన ఆలోచన వొచ్చి ఉంటుంది. కుక్కచేత కరిపించడం ఏం కష్టం? కాని... కరిచే కుక్క నా కక్కర్లేదు. ఇవాళ ఉదయం రోజా... ఇప్పుడు నువ్వు జూలీ కరవడం మరుగుతుంది. అంచేత దాన్ని నువ్వు పట్టుకుపోయి నీయిష్టమొచ్చినన్ని సార్లు కరిపించుకో.." అని – యింట్లోకి చూస్తూ – "జూలీ!" అని కేకవేశాడు గంగాధరం.

## రచయితలకు విజ్ఞప్తి

చినుకులో 'ఛాయావేదిక'కు పంపే ఫోటోల వెనుక మాత్రమే సమాచారం వివరంగా తెలియచేయండి.


## చినుకు పాఠకులకు విజ్ఞప్తి

## 'చినుకు'

సాహిత్య మాస పత్రిక

మీకు నచ్చితే వెంటనే చందాదారులుకండి

ఇప్పటికే చందాదారులై ఉంటే మీ మిత్రులతో చందా కట్టించండి